
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## వేడుకగా వ్యాళివాహనంపై ఆత్మారామస్వామి వారు



**సంగం జూన్ 19 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని సీతాలక్ష్మణ సమేత ఆత్మారామస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారు వ్యాళివాహనంపైన భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని సుగంధ పుష్పాలతో అలంకరించారు. ఉభయకర్తలుగా కామాబత్తిన మల్లయ్య అండ్ సన్స్, కామాబత్తిన వెంకటేశ్వర్లు, కామాబత్తిన పెద్ద వెంకయ్య, కామాబత్తిన వెంకటశేషయ్య, కీర్తిశేషులు పబ్బు సాంబయ్య, పబ్బు హజరత్తయ్య, చిరందాసు వెంకటేశ్వర్లు, కామాబత్తిన పెంచలయ్య వ్యవహారించారు. పూజా కార్యక్రమాలను వేదగిరి సత్యనారాయణ చార్యులు, వేదగిరి భరత్‌కుమార్, రాజ్‌కుమార్‌స్వామి వ్యవహారించారు.

## నగరంలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



**నెల్లూరు క్రైం, జూన్ 19, ప్రభాతవార్త** నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో లాడ్జిలను పోలీస్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు తావిస్తే చట్టపరమైన చర్యలు తప్పవంటూ జిల్లా ఎస్పి కె. ఆరీఫ్ హాఫీజ్ చేసిన ఆదేశాలకు అనుగుణంగా చేపట్టిన ఈ తనఖీల్లో భాగంగా లాడ్జీలో పోలీసులు ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, రాత్రి వేళల్లో లాడ్జిలులో బస చేసిన వ్యక్తులను ప్రశ్నిస్తూ, వారి వివరాలపై ఆరా తీశారు. లాడ్జిల యజమాన్యం ఇతర రాష్ట్రాలకు చెందిన ఎవరైనా అనుమానాస్పదంగా అన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులను చెక్ చేసి వారి యొక్క వేలిముద్రలు తీసుకుంటూ, నేరములు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను యాజమాన్యాలకు వివరించారు. లాడ్జి పరిసరాలు స్పష్టంగా కన్పించేలా తప్పనిసరిగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, నేర నియంత్రణకు జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.

## ప్రశాంతిరెడ్డిని అభినందిస్తున్న వార్డన్లు



**కోవూరు జూన్ 19 ప్రభాతవార్త** కోవూరు ఎస్ డబ్ల్యూ పరిధిలోని ఎన్‌జిఓ అసోసియేషన్ అధ్యక్షులు బి.వెంకయ్య ఆద్వర్యంలో సాంఘిక సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఎస్‌డబ్ల్యూ తిరపతి మూడు మండలాలకు సంబందించిన సంక్షేమాధికారులు బుధవారం రాత్రి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలతో అభినందించారు. ఈ సందర్భంగా తమశాఖకు సంబందించిన అనేక విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు.

## ఎంపిడిఓ కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమీక్ష



**నెల్లూరు రూరల్, జూన్ 19, ప్రభాతవార్త** ఎంపిడిఓ కార్యాలయంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రూరల్ మండలంలోని 18 గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసారు. అభివృద్ధిలో రాజీపడేది లేదన్నారు. ఇప్పటి వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన అధికారులు మారండన్నారు. అనంతరం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## కోటి రూపాయలు విలువ చేసే భూమిని అక్రమించిన వైసిపి నేత

## కబ్జాకు గురైన భూమిని తొలిగించిన తహాశీల్దార్

వెంకటాచలం జూన్ 19 ప్రభాతవార్త అదికారం అండతో వైసిపి నాయకులు విచ్చలవిడిగా భూ అక్రమాణాలకు పాల్పడ్డారు. మండల పరిదిలో కంటేపల్లికి చెందిన వైసిపి నాయకుడు ఏకంగా సర్వే నెంబర్287 5 ఎకరాలు అటవీ పోరంబోకు భూమిని అక్రమించి దాని చుట్టు కంచె ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వ భూమిలో సిమెంట్‌బ్రిక్స్, కర్మాగారాని, మిగిలిన ప్రభుత్వ భూమిని ప్రవేట్ లైవుట్‌గా సృష్టించి ప్లాట్లు అమ్మేందుకు పునుకున్నాడు. దీంతో గ్రామస్తులు అక్రమాలుపై తహాశీల్దార్‌కు పిర్యాదు చేయడంతో తహాశీల్దార్ పూర్ణచంద్రరావు రంగములోకి దిగి విచారించగా ప్రభుత్వ భూమిగా గుర్తించారు. దీంతో జిల్లా కలెక్టర్ అదేశాలతో కంటేపల్లి గ్రామంలో అక్రమణలకు గురైన ప్రభుత్వ భూమిని, సిమెంట్ బ్రిక్స్ కర్మాగారాని జేసిబితో తోలిగించారు. ప్రభుత్వ భూమిగా ఎచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

## నేటి నుండి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



**కలువాయి జూన్ 19 ప్రభాతవార్త** మండలంలోని రాజుపాళెం పరమానందస్వామి ఆశ్రమంలో వెలసియున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుండి 26 వరకు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామనుజ చిన్నజియర్‌స్వామి వారిదివ్యమంగళ శాసనాలతో నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు ఈదూరు రామాచార్యులు తెలిపారు. ఉభయకర్తల ఆద్వర్యంలో విశేషంగా జరగనున్న ఈకార్యక్రమాలలో ప్రతి రోజు హోమా పూజా కార్యక్రమాలతోపాటు ప్రసాద వితరణ అదే విధంగా ప్రతినిత్యం ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు వేద గురువులు విద్యార్ధులతో వేద ఘోష్టి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు ఈకార్యక్రమంలో పాల్గోని స్వామి వారిని దర్శించుకొని తీర్ద ప్రసాదాలు స్వీకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. శ్రీమధుభయా వేదంతాచార్య పీఠం నందు స్వామి వారి ఆశ్రమం సమీపంలో పెన్నానది ఒడ్డున ఆహ్లాదకరమైన ప్రదేశంలో ఆధ్యాత్మిక భావనతో విరాజిల్లుతున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్ధానం ఇక్కడ ఎంతో ప్రాచీనమైనది.

## ఇంటూరిని కలిసిన పలువురు పార్టీ శ్రేణులు



**ఉలవపాడు, జూన్ 19, ప్రభాతవార్త** కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును బుధవారం పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కందుకూరు పట్టణ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాలల నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఉలవపాడులోని శ్రీ వేణుగోపాల్ స్వామి ఆలయ అధికారులు, పూజారులు నాగేశ్వరరావుని కలిసి స్వామివారి చిత్రపటంతో పాటు ఆశీర్వచనాలు అందజేశారు. నియోజకవర్గంలోని పలు మండ లాలకు చెందినఅధికారులు, వ్యాపారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కలిశారు.

# జిల్లాలో కరవు పరిస్థితులను అంచనా




నెల్లూరు అర్బన్, జూన్19, ప్రభాతవార్త జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో నెలకొన్న కరవు పరిస్థితుల దృష్ట్యా ఆర్ధిక సహాయం అందించేందుకు కృషి చేయాలని కేంద్ర కరవు బృంద సభ్యులను జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ కోరారు. జిల్లాలో కరవు పరిస్థితులను అంచనా వేయడానికి విచ్చేసిన కేంద్ర బృంద సభ్యులు మన్ను జి.ఉపాధ్యాయ్, ఎస్‌సి కష్యప్, మధన్‌మోహన్ మౌర్య, బి.అనురాధ బుధవారం ఉదయం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్‌తో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న కరవు పరిస్థితులను శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ కేంద్ర బృంద సభ్యులకు వివరించారు. జిల్లాలోని వలేటివారిపాలెం, కందుకూరు, లింగసముద్రం, సీతారామపురం, వరికుంటపాడు, కొండాపురం, కలిగిరి, దుత్తలూరు, మర్రిపాడు, కలువాయి మండలాలను జాతీయ విపత్తుల సంస్ధ కరవు మండలాలుగా ప్రకటించిందన్నారు. ఈ పది మండలాల్లో సాధారణ వర్షపాతం కన్నా తక్కువగా వర్షపాతం నమోదైందన్నారు. అలాగే సీతారామపురంలో 50శాతానికి పైగా, మిగిలిన 9 మండలాల్లో 30నుండి 40శాతం మేర పంటనష్టం వాటిల్లిందన్నారు. ఈ పది మండలాల్లో 7156మంది రైతులకు చెందిన 9053.21హెక్టార్లలో వరి, శనగ, వేరుశనగ, మినుము, చిరుధాన్యాలు మొదలైన పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని, వీరిని ఆదుకునేందుకు 849.25లక్షలతో ఇన్‌పుట్ సబ్సీడీ అంచనాలను కేంద్ర బృందానికి కలెక్టర్ వివరించారు. సీతారామపురంలో అత్యధికంగా 148మంది రైతులు 69హెక్టార్లలో పంటలు నష్టపోయారని, వీరికి 9.25లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు అంచనావేసినట్లు చెప్పారు. అలాగే పశుసంవర్ధకశాఖకు సంబంధించి7,42,306 చిన్న, పెద్ద పశునష్టం జరగ్గా, ఎన్‌డిఆర్ఎఫ్ నిబంధనలు మేరకు 5302పశువులకు నష్టపరిహారం చెల్లించేందుకు అవకాశం ఉందని, ఈ పది మండలాల్లో పశుదాణా, మందుల కోసం రూ.291.15లక్షలు బడ్జెట్ అవసరమని అంచనా వేసినట్లు వివరించారు. జిల్లాలో 10కరువు మండలాల్లో వ్యవసాయం, రూరల్ వాటర్ సప్లయ్, పశు సంవర్ధకశాఖలకు సంబంధించి రైతులను ఆదుకునేందుకు రూ.1335.69లక్షల మేర నిధులు అవసరమని కలెక్టర్ కేంద్ర బృందసభ్యులకు వివరించారు. జిల్లాలో వర్షాలు చెదురు, మదురుగానే కురుస్తున్నాయని, రానున్న రెండు నెలల్లో ఇదే పరిస్థితి ఉంటే మెట్ట ప్రాంతాల్లో తాగు, సాగునీటికి ఇబ్బంది కలుగుతుందని, ట్యాంకర్ల ద్వారా తాగునీటిని చేయాల్సి వస్తుందన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని జిల్లాకు నిధులు మంజూరు చేయించేందుకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కేంద్ర బృంద సభ్యులకు కలెక్టర్ కోరారు.

**ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన కేంద్ర బృంద సభ్యులు........** శంకరన్ సమావేశ మందిరంలో జిల్లాలో కరవు పరిస్థితులను వివరించే ఫోటోలతో సమాచారశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందసభ్యులు పరిశీలిం చారు. వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పశుసంవర్ధకశాఖల సంబంధించిన, జరిగిన నష్టాలను ఆయా శాఖల అధికారులు ఫోటోలతో కేంద్ర బృంద సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో డిఆర్‌వో లవన్న, జిల్లా వ్యావసాయాధికారి సత్యవాణి, పశుసంవర్ధకశాఖ జేడి మహేశ్వరుడు, నుడా వీసీ బాపిరెడ్డి, సీపీవో రాజు, ఇరిగేషన్ డిఇ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ తిరుమలకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**నెల్లూరు కార్పొరేషన్, జూన్ 19, ప్రభాతవార్త** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నగర వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవాలని ఇంచార్జ్ కమిషనర్ శర్మద తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ ప్రజారోగ్యం విభాగాల అధికారులు, సచివాలయం వివిధ విభాగాల కార్యదర్శులతో వెక్టార్ బోర్న్ డీసీజ్ అంశంపై సమీక్షా సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులైన వెక్టార్ బోర్న్ డీసీజ్, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, డెంగ్యూ, బోదకాలు, మెదడు వాపుతో పాటు ఇతర వ్యాధుల ను అరికట్టడానికి ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలో అన్ని డివిజనుల్లో ఇండ్ల చుట్టూ, ప్రాంగణాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకునే విధంగా గృహాల యజమానులకు అవగాహన కల్పించాలని, దీని కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. దోమల లార్వా ఎదుగుదలకు దోహదపడే మంచినీటి సరఫరాలో లీకేజీ ప్రాంతాలు, వాడి పడేసిన టైర్లలో నిల్వ ఉండే నీరు, బహిరంగ ప్రదేశాల్లో డంప్ చేసిన ఖాళీ కొబ్బరి బోండాలలో నిల్వ ఉండే వర్షపు నీరు, పూల కుండీలు, వాడకంలో లేని నీటితొట్లు, బావులపై ప్రజలందరికీ చైతన్యం కల్పించాలని సూచించారు. సూచించిన అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి దోమల ఎదుగుదలను నివారించే చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల ఫలితంగా సీజనల్ వ్యాధులతో పాటు విషజ్వరాలు ప్రభలే అవకాశం అధికంగా ఉంటుందని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి వడగాచిన నీటిని తీసుకోవాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ వెంకటరమణ సూచించారు. ఇంజినీరింగ్ ఎస్ఈ సంతప్ కుమార్ మాట్లాడుతూ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ల నుంచి సరఫరా అవుతున్న తాగునీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా సంబంధిత సచివాలయం కార్యదర్శులు తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి, నివేదికలను ఉన్నతాధికారులకు అందించాలని సూచించారు. సిటీ ప్లానర్ దేవీ కుమారి మాట్లాడుతూ నూతన భవన నిర్మాణాల వద్ద తీసిన గంటలలో నీరు నిల్వ చేరకుండా యజమానులకు సూచించాలని కోరారు. అర్బన్ ఫామిలీ వెల్ఫేర్ అధికారి జిజియా బాయి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం దోమల నివారణ కోసం డ్రైడే నిర్వహించి, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరికీ అవగాహన కల్పించి సూచనలు పాటించేలా పర్యవేక్షించాలని సూచించారు. సమీక్ష అనంతరం వివిధ అంశాలపై సచివాలయ కార్యదర్శుల సందేహాలను డిప్యూటీ కమిషనర్ చెన్నుడు నివృత్తి చేశారు. సమావేశంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు, శానిటేషన్ విభాగం అధికారులు, సచివాలయం అమెనిటీస్, శానిటేషన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొని రండి



**కోవూరు జూన్ 19 ప్రభాతవార్త** కోవూరు నియోజకర్గ పరిధిలోని 5 మండలాలలో పనిచేస్తున్న సర్వేయర్లు, సచివాలయ సర్వేయర్లు, విధి నిర్వహణలో అంకిత భావం చూపుతు ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కార్యక్రమంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతు ప్రతి సర్వేయర్ వారికి కేటాయించిన బాద్యతలు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. అనంతరం సర్వేయర్లు ఎమ్మెల్యేని శాలువా పుష్పగుచ్చంతో ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో ఐదు మండలాల సర్వేయర్లు వి .శ్రీనివాసులురెడ్డి, వి రమేష్‌గౌడ్, వై మూసెస్ , హరినాద్, శోభన్‌బాబు, 5 మండలాల సచివాలయ సర్వేయర్ల ఉన్నారు.

# వైసిపి నేత మన్నెమాల చూపు టిడిపి వైపా?

## కావలి రాజకీయాలలో జోరుగా ప్రచారం

**కావలి, జూన్ 19 ప్రభాతవార్త :** వైసిపి పాలనలో కావలి నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తూ వందలాది కోట్ల రూపాయల సహజ సంపదను దోపిడీ చేశాడన్న ఆరోపణ విమర్శలు మోసిన వైసిపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మన్నెమాల సుకుమార్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలోకి జంప్ అయ్యేందుకు రంగం సిద్దం చేసుకుంటున్నట్లు కావలి రాజకీయాలలో జోరుగా ప్రచారం సాగుతోంది. వైసిపి పాలనలో ఎమ్మెల్యేగా పనిచేసిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి మన్నెమాల షాడో ఎమ్మెల్యేగా వ్యవహరించారన్న ప్రచారం వుంది. గత ఐదేళ్ల పాలనలో కావలి పట్టణం, నియోజకవర్గ ప్రాంతాలలో మన్నెమాల చెప్పిందే వేదంగా సాగింది. అధికార యంత్రాంగాలు ఆయన కనుసైగల్లో నడిచాయి. దీంతో కావలి నియోజకవర్గంలో దాడులు, అరాచకాలు పేట్రేగిపోయాయన్న విమర్శలు లేకపోలేదు. ఆనాటి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి మన్నెమాల వల్ల బాగా చెడ్డపేరు రావడంతో ఎన్నికలలో ఓడిపోతామన్న భయంతో మన్నెమాలను వైసిపి పార్టీ నుంచి సస్పెండ్ చేయడం జరిగింది. కావలి నియోజకవర్గంలో చేసిన దాడులు, అరాచకాలు, సహజ సంపద దోపిడీ చేసిన మోసాలు తనకు సంబంధం లేదంటూ ప్రతాప్‌కుమార్‌రెడ్డి పార్టీ నుండి మన్నెమాలను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు. అయితే వైసిపి అగ్రనేతలతో సత్సంబంధాలు పెంచుకున్న మన్నెమాల తన సస్పెన్షన్‌ను రద్దు చేయించుకునేందుకు తెగ ప్రయత్నాలు చేశారు. అయితే ఇది పెద్ద హైటెక్ డ్రామా అంటూ ఆనాడు ప్రచారం సాగింది. ఈ దశలో వైసిపి అగ్రనేత విజయసాయిరెడ్డిని లొంగదీసుకొని సస్పెన్షన్‌ను మన్నెమాల రద్దు చేయించుకున్నారు. పార్టీలో తన సత్తా ఏమిటో అని ఆనాడు ఆయన నిరూపించారు కూడా. మన్నెమాల తిరిగి వైసిపి ప్రవేశం చేయడంతో ఎమ్మెల్యేకు సంబంధించిన వ్యక్తులు విముఖత వ్యక్తం చేశారు కూడా. ఈ ఎన్నికలలో మన్నెమాల అవసరం వుందంటూ పెద్ద బిల్డప్ ప్రచారం చేయించుకుని ఆయన వైసిపిలోకి తిరిగి రంగ ప్రవేశం చేసినట్లు ప్రచారం సాగింది. గత ఎన్నికలలో ప్రతాప్‌రెడ్డి, మన్నెమాల సుకుమార్‌రెడ్డిలు ఇద్దరు కలిసి ప్రచారం చేయడంతో ఇది హైటెక్ డ్రామా అన్న ప్రచారానికి అద్దంపట్టింది. ఒక్కసారిగా కావలి నియోజకవర్గంలో మన్నెమాల రంగ ప్రవేశం దుమారంగా మారింది. గత ఎన్నికలలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద



రవిచంద్ర, కావలి టిడిపి అభ్యర్ధి ఆయన బంధువైన కావ్య కృష్ణారెడ్డిలపై విమర్శల ఆరోపణాస్త్రాలు సంధించారు కూడా. ఎన్నికల కౌంటింగ్ రోజున నెలూరులో మూడవ రౌండ్‌కే మన్నెమాల బయటకు వచ్చి తనకు టిడిపిలో ఆఫర్ వున్నా వైసిపిలో కొనసాగడం దురదృష్టకరమంటూ చెబుతూ వెళ్లారన్న ప్రచారం సాగింది. కావలి ఎమ్మెల్యేగా కావ్య కృష్ణారెడ్డి ఊహించని రీతిలో భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఈ నేపధ్యంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిఅక్రమ లేఅవుట్లదారులపై కొరడా ఝుళిపించేందుకు శ్రీకారం చుట్టారు. కావలి మున్సిపాల్టీలో అక్రమ లేఅవుట్లకు రారాజుగా పేరుగడించిన మన్నెమాల అక్రమ లేఅవుట్ల బాగోతం బట్టబయలవుతుందన్న భయంతో తన ఆస్తులు కాపాడుకునేందుకు తెలుగుదేశం పార్టీలోకి జంప్ చేసేందుకు మంతనాలు సాగిస్తున్నట్లు ప్రచారం కూడా సాగుతుంది. అంతేకాకుండా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తనకు అత్యంత బంధువు అని అందరికి గుర్తు చేస్తున్నట్లు కూడా ప్రచారం సాగుతోంది. కావలి ప్రాంతంలో వందలాది కోట్లు రకంకాల మార్గాలలో సంపాదించిన మన్నెమాల సుకుమార్‌రెడ్డిని టిడిపిలో చేర్చుకుంటే పార్టీ అదోగతి పాలవుతుందన్న ప్రచారం కూడా లేకపోలేదు. ఈ విషయంలో బంధువని చెప్పుకుంటున్న మన్నెమాలను టిడిపిలోకి అడుగుపెట్టకుండా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అడ్డుకుంటారా లేక మౌనం వహిస్తారా అన్నది కూడా వేచిచూడాల్సిందే. కావలి నియోజకవర్గంలో ఆనాడు అరాచకాలు సృష్టించిన మన్నెమాలపై టిడిపి అగ్రనేతలు చర్యలు చేపడతారా, మనకెందుకులే కావలిఎమ్మెల్యే చూసుకుంటారని వదిలేస్తారా అన్నది కూడా చూడాల్సి వుంది. వైసిపి పాలనలో ఎంతోమంది టిడిపి నేతలు, కార్యకర్తలు ఇబ్బందులు పడ్డారు కూడా. కావలి సహజ సంపదను దోపిడీ చేసిన వ్యక్తులపై చర్యలు చేపట్టి టిడిపి నేతలకు, కావలి ప్రజలకు ఊరట కలిగిస్తారా అన్నది కూడా తేలాల్సి వుంది.

## ప్రైవేటు పాఠశాలల్లో హద్దులు లేని ఫీజుల దోపిడీ

**ఉలవపాడు, జూన్ 19, ప్రభాతవార్త** : ఒక పక్క మండుతున్న ఎండలు, మరో పక్క పెరిగిన ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల ఫీజులు దడ పుట్టిస్తున్నాయి. పెరిగిన కార్పొరేటర్, ప్రైవేటు పాఠశాలల ఫీజులతో మధ్య తరగతి కుటుంబాల బడ్జెట్ తలకిందులు అవుతోంది. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందించడంలో విఫలం అవడంతో మధ్య తరగతి ప్రజలతో పాటు పేద ప్రజలకు కూడా తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించాలని తపనతో ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపడంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు భారీగా ఫీజులు పెంచి విద్యార్థుల తల్లిదండ్రులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. కుటుంబ బడ్జెట్‌లో ఎక్కువ భాగం చదువుల కోసం వెచ్చించడం, ఆ తర్వాత మార్కెట్లో పెరిగిన ఉప్పు పప్పు రేట్లతో పాటు నిత్యవసర సరుకుల ఖర్చు కూడా భారమైంది. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు పెంచడంతో పాటు స్కూల్ బ్యాగ్‌లు, పుస్తకాలు పేరుతో అదనపు భారాన్ని వేస్తున్నారు. ఫీజుల మోత పెరగనుండగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆంగ్ల విద్యపై మోజు పెంచుకున్నారు. ఏ ఆసక్తిని సొమ్ము చేసుకుంటూ ప్రైవేటు పాఠశాలల యాజామాన్యాలు ఫీజులు భారీగా పెంచుతున్నాయి. యూనిఫాం, బుక్స్, నోట్ పుస్తకాలపై ఇబ్బడి ముబ్బడిగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. ఇవన్నీ తమ వద్ద కొనాలని హుకుం జారీ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలు కాకుండా వారు రూపొందించిన పాఠ్యపుస్తకాల ద్వారా విద్యాబోధన చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు పాతర వేస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుల మోత గురించి ప్రభుత్వాలు, విద్యావేత్తలు, మేధావులు తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమస్యలపై విశ్లేషణలు, చర్చలు జరుగుతున్నప్పటికి పరిష్కారం మార్గం మాత్రం కనుక్కోలేకపోతున్నారు. అధిక ఫీజులను అరికట్టలేకపోతున్నారు. సీబీఎస్ఈ వారు మార్గదర్శకాలు రూపొందించినప్పటికి ఆయా కార్పొరేట్ ప్రైవేటు యాజామాన్యలు అమలు చేయడం లేదు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలని చదువుకొనే విధంగా కాకుండా, చదువుకునే విధంగా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## నేను బడికి పోతా విజయవంతం చేయాలి



**కోవూరు, జూన్19ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను పూర్తిస్థాయిలో బడిలో చేర్పించేందుకు గానూ విద్యాశాఖ ఏర్పాటు చేసిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని మండల విద్యాశాఖ అధికారి రహీమ్ అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నేను బడికి పోతా కార్యక్రమంపై కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, వెల్‌ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్ఎంటీలు, ఐఈఆర్టీలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో జిల్లా విద్యాశాఖ ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీకి మెంబర్ కన్వీనర్‌గా ఎంఈవో , చైర్మన్‌గా ఎంపీడీవో , సభ్యులుగా తహసీల్దార్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉంటారన్నారు. జూలై 17వ తేది వరకు ఈ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని ఆవాస ప్రాంతాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో విద్య యొక్క ప్రాముఖ్యత, విద్యకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు ఉపయోగాలు, తదితర అంశాలపై తల్లిదండ్రుల్లో మరింత అవగాహన పెంచేలా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బడి ఈడు కలిగిన పిల్లలను నూటికి నూరుశాతం పాఠశాలల్లో చేర్పించేలా ఈ కమిటీ ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా ఆరు నుంచి 14 సంవత్సరాలు వయస్సు కలిగిన డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నాగూర్‌వలి, సీడీపీవో జ్యోతి, మండల విద్యాశాఖ అధికారి-2 వై. చెంచులక్ష్మమ్మలు పలు సూచనలు చేశారు.

## ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా పనిచేయాలి !



**కావలి, జూన్ 19 ప్రభాతవార్త :** ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా సచివాలయ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కావలి పట్టణ టిడిపి 20వ వార్డు ఇన్‌చార్జ్ పెంచలయ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్ తిరివీధి ప్రసాద్‌లు తెలిపారు. స్థానిక 20వ వార్డు సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సచివాలయ సిబ్బంది పరిధిలో ఎవరెవరు ఏఏ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిలకు మంచిపేరు తెచ్చేలా సచివాలయ సిబ్బంది పాటుపడాలన్నారు. సమస్యలు ఏదైనా వుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వార్డు ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఒక్క ఫోన్ చేస్తే అందుబాటులో వుంటామన్నారు. ఎన్డీఏ కూటమి కొత్త ప్రభుత్వంలో ప్రజలందరికి న్యాయం జరగాలన్నారు. ఈ సమావేశంలో వార్డు నాయకులు గోపాలయ్య, శ్రీనివాసులు, సురేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎపిటిఎఫ్ సభ్యత్వ నమోదు



**వింజమూరు, జూన్19, ప్రభాతవార్త :** వింజమూరు మండలంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం వింజమూరు మండలంలోని ఊటుకూరు , కాటేపల్లి, ఆర్‌కెహెచ్ , వింజమూరు బాలుర, బాలికల పాఠశాలల్లో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు శివకోటారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఎపిటిఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. సమస్యల పరిష్కార సాధనలో ముందుంటుందన్నారు. నూతన ప్రభుత్వం సకాలంలో డిఎలు చెల్లించాలని, పిఎఫ్ , ఎపిజిఎల్ఐఎస్ బకాయిలు చెల్లించాలని, సరండర్ లీవ్‌లు మంజూరు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, జిల్లా కౌన్సిలర్లు పేరం మల్లిఖార్జున, గుర్రం నారాయణ, యు.ప్రసాద్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మర్రిపాడులో జనసేన,టిడిపి కార్యకర్తల సంబరాలు

**మర్రిపాడు, జూన్19, ప్రభాతవార్త** :మొదటిసారిగా అసెంబ్లీలో అడుగుపెడుతున్న జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌కి మర్రిపాడు జనసేన అధ్యక్షురాలు ప్రమీల, టిడిపి నాయకులు ఆరికట్ల పుల్లయ్య నాయుడు ,ముప్పాళ్ళ వెంకట్‌చౌదరిలు శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయం లోని తన చాంబర్‌లో డిప్యూటీ సిఎం ,మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో జనసేన, టిడిపి కార్యకర్తలు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించి కేటాయించిన పలు శాఖలకు న్యాయం చేస్తూ ప్రజలకు మేలు చేయాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందూ సామ్రాజ్య దివాస్ వేడుకలు



**వింజమూరు, జూన్19, ప్రభాతవార్త :** ఛత్రపతి శివాజీ పట్టాభిషేక వార్షికోత్సవం సందర్భంగా వింజమూరు పట్టణంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దివాస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయం నుండి ట్రాక్టర్‌పై ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి మెగా బైక్ ర్యాలీ వింజమూరు పట్టణంలో బిసి కాలనీ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఛత్రపతి శివాజి పట్టాభిషేక వార్షికోత్సవాన్ని హిందూ సామ్రాజ్య దివాస్ గా జరుపుకోవడం ఆనవాయితీగా వసో_ంది. హిందూ సంస్కృతిని, సమాజాన్ని సంరక్షించిన వారిలో అగ్రగణ్యుడిగా పేరుగాంచిన వీరుడు శివాజీ అన్నారు. శివాజీ తండ్రి సాహాజీ నిజాం సాహీల ప్రతినిధిగా ఉంటూ మొగల్ రాజులను వ్యతిరేకిస్తూ యుద్ధాల్లో పాల్గొనేవాడు.శివాజీ తల్లి జిజియాబాయి వ్యవసాయ పనులు చేసుకుంటుండేదన్నారు. జిజియా బాయి పూజించే శివపార్వతి పేరును శివాజీకి పెట్టిందన్నారు. శివాజీ తల్లి శివాజి కి పుట్టిన భూమిపైన ప్రేమ ఉండేలా విద్యాబుద్ధులు నేర్పారన్నారు. చిన్నప్పటి నుండి భారతం, రామాయణం, బలిచక్రవర్తిల కథలను చెప్పి వీరుని లక్షణాలను పెంపొందించిందన్నారు. స్త్రీల పట్ల గౌరవం తదితరులు శివాజి తల్లినుండి నేర్చుకున్నారన్నారు. శివాజీ తండ్రి పొందిన పరాజయాలను క్షుణ్ణంగా అధ యయనం చేసి యుద్ధ తంత్రాలను తెలుసుకున్నాడన్నారు. మరాఠీ సామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా తన వ్యూహాలను మొదలు పెట్టారన్నారు. తన యుద్ధనైపుణ్యంతో మరాఠీ రాజ్యానికి అధిపతి అయ్యారన్నారు. ఈకార్యక్రమంలో ప్రాంత ప్రచార ప్రముఖ్ బయ్యా వాసు, ప్రముఖ విద్యావేత్త యల్లాల రఘురామిరెడ్డి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వింజమూరు ఖండ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం



**వరికుంటపాడు, జూన్ 19, ప్రభాతవార్త :** విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమూల మార్పుల శ్రీకారం చుట్టారనీ,అందులో భాగంగానే మెగా డిఎస్సి కి ప్రధాన్యత ఇస్తు మొదటి సంతకం పెట్టారని టీడీపీ మండల పార్టీ కన్వీనర్ చంద్రా మధుసూధన్‌రావు,జెడ్పిటిసి సభ్యులు రావెళ్ల నాగేంద్రలు అన్నారు.బుధవారం వరికుంటపాడు జెడ్పి ఉన్నత పాఠశాల్లో మండల విద్యాశాఖాధికారి షేక్ షావుద్దిన్,ప్రధానోపాధ్యాయులు వీర భద్రయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వం అందించిన విద్యార్థులుకు నోటు పుస్తకాలను,యూనిఫామ్,నోటు పుస్తకాలను నేతలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు.ఈ కార్యక్రమములో సర్పంచ్ కొండెపోగు దిలీప్‌కుమార్, మండల సీనియర్ నేతలు,అంద్రా బాలగురవారెడ్డి, చంద్రా వెంకయ్య,మండల ప్రధానకార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్ ,తెలుగుయువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మినారాయణ,నేతలు పోకా మహేష్,అంద్రా నాగిరెడ్డి, కామేపల్లి వెంకటరత్నం,అంద్రా శివరామిరెడ్డి,లింగం మాలకొండయ్య,పొద మాధవరావు,వేమూరి మధుసూధన్ రావు,పేరేచర్ల శ్రీనివాసులు,విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మందాటి చెరువు, రాళ్ళగుట్ట పోరంబోకు స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు




**కావలి, జూన్ 19 ప్రభాతవార్త :** కావలి మున్సిపాల్టీ పరిధిలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లే దారిలో బుధవారం మందాటి చెరువు, రాళ్ళగుట్ట పోరం బోకు స్థలాలలో రెవెన్యూ అధికారులు హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ స్థలాలలో ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరికల బోర్డులో అధికారులు హెచ్చరించారు. ఈ ప్రాంతంలో ఇటీవల కాలంలో రెవెన్యూ అధికారులు ఫిర్యాదు లను పురస్కరించుకుని హెచ్చరికల బోర్డులు వేయడం, పక్క రోజు తీసివేయడం జరుగుతుందని ప్రజలు దుయ్యబడుతున్నారు. రెవెన్యూ ఎటువంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వకపోయినా యథేచ్ఛగా కట్టడాలు జరిగిపోతున్నాయి. చట్టవిరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మందాటి చెరువును, రాళ్ళగుట్ట పోరంబోకు స్థలాలను పరిరక్షించి అక్రమ కట్టడాలను తొలగించి వారిపై చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కోటేశ్వర రావు ఆచూకి చెప్పాలంటూ ఆందోళన



**రాపూరు, జూన్19ప్రభాతవార్త :** గత 22 రోజులుగా కనపడకుండా వున్న దంతం కోటేశ్వర రావు ఆచూకి తెలపాలంటూ బాలయపల్లి మండలం,అంబలపూడికి చెందిన పలువురు బుధవారం రాపూరు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలయపల్లి మండలం,అంబలపూడి గ్రామానికి చెందిన దంతం కోటేశ్వర రావు 22 రోజుల క్రింతంతన అత్తగారి ఊరైన రాపూరు మండలంలోని ఓబులాయపల్లి గ్రామానికి తన బార్య దగ్గరకు రావడం జరిగిందన్నారు.అప్పటి నుండి కోటేశ్వర రావు ఆచూకి తెలియడంలేదని తెలిపారు. దీనిపై ఎన్నిసార్లు కోటేశ్వరరావు భార్యనుఅడిగినా సరైన సమాధనం చెప్పడం లేదని ఆమెను విచారించి కోటేశ్వర రావు ఆచూకి తెలపాలని వారు కోరారు.

## సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనపై పంగలిలలో అవగాహన



**రాపూరు, జూన్19ప్రభాతవార్త :** సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలణపై బుధవారం మండలంలోని పంగలి గ్రామంలో అవగాహనాసదస్సు నిర్వహించారు. పంగిలి అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించినఈ కార్యక్రమంలో యం.ఎల్.హెచ్.పి రామలక్ష్మి మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి వారసత్వంగా వచ్చేఎర్ర రక్తకణాల రుగ్మత అన్నారు. ఇది తల్లితండ్రుల నుండి అనువంశికంగా సంక్రమిస్తుందన్నారు. రక్త కణాల సంఖ్యతగ్గడం,కళ్ళు పసుపు రంగులోకి మారడం,తీవ్రమైన వోళ్ల నోప్పులు,కీళ్ల నోప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది,అలసట,తరచుగా అంటు వ్యాధులు రావడం, గర్భాదారణ సమయంలో సమస్యలు, అవయవ వైఫల్యం,పెరుగుదలసమస్యలు ఈ వ్యాధి లక్షణాలు అన్నారు. 0 నుండి 40 సంవత్సరాల వయస్సులో వున్న గిరిజనులందరూ వ్యాధినిర్ధారణపరిక్షలను నిర్వహించుకోవాలని, వ్యాధి నిర్ధారణ తరువాత హైడ్రాక్సి యూరియా మాత్రలు,ఫోలిక్ యాసిడ్‌మాత్రలు, తీసుకోవడం, అవసరమైతే రక్తం ఎక్కించడం,రోగం యొక్క స్థాయిని బట్టి ఎముక మజ్జ మార్చబడుతుందన్నారు.ఆరోగ్య కార్యకర్త సరిత కుమారి, అంగన్‌వాడీ కార్యకర్త ఆర్.రాజేశ్వరీ, వి.ఒ.ఓ వై.జ్యోతి, ఆశా కార్యకర్త నల్లు మౌనిక,పలువురు గర్భవతులు,బాలింతలు వున్నారు.

## దాతృత్వానికి నిర్వచనం దొడ్ల కోదండరామిరెడ్డి





**బుచ్చి జూన్ 19 ప్రభాతవార్త :** పేద విద్యార్దులను ప్రోత్సహిస్తు వారి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్న మాజీ ఎంపిపి దొడ్ల విజయలక్ష్మి భర్త దొడ్ల కోదండరామిరెడ్డి దాతృత్వం అభినం దనీయమని ఎంఇఒ ఎం .దిలీప్‌కుమార్. ఎంఇఒ,2 పి.వి రత్నం ప్రశంసి ంచారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రామచం ద్రాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్దులకు తిరుపతికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యప్ప చరణ్‌రెడ్డి దాతృత్వంతో అందజేసిన బుక్స్ పంపిణి చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇలాంటి దాతలు పేద విద్యార్దులను ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు. కోదండరా మి రెడ్డి కేవలం పేద విద్యార్దులకే కాకుండా,బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రభుత్వ వైద్యశాలకు అనేక వస్తువులు అందచే యడం జరిగిందని అ న్నారు. ఆయన సేవలు అద్భుతమని ప్రశం సించారు.ఈ కార్యక్రమంలో ఒకటో తరగతి విద్యార్ధు లకు విద్యాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివా సులురెడ్డి, జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్‌కుమార్, టిడిపి నాయకులు సునీ ల్‌కుమార్, ఆదాల శేషయ్య,ఉపాధ్యా యులు, వేదవతి,బ్రహ్మారె డ్డి, నిర్మల,వేణు,విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాప్రవేశ్ బృందం పర్యటన



**అల్లూరు, జూన్ 19 ప్రభాతవార్త** : అల్లూరు మండల పరిధిలోని ఇస్కపల్లిపట్టపుపాళెంలోని ప్రాథమిక పాఠశాలను విద్యాప్రవేశ్ బృందం పరిశీలించింది. విద్యాప్రవేశ్ బృందం పర్యటనలో భాగంగా ఎన్‌సిఇఆర్‌టి న్యూఢిల్లీకి చెందిన డాక్టర్ జూబిలి పద్మనాభన్, సమగ్ర శిక్ష నెల్లూరు అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ జి.సుధీర్‌బాబు, ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) పల్లెపాడు ఉపన్యాసకులు కె.విజయచందర్‌లు పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ జూబిలి పద్మనాభన్ మాట్లాడుతూ విద్యాప్రవేశ్ అనే కార్యక్రమం జాతీయ విద్యా శిక్షణ పరిశోధన మండలి (ఎన్‌సిఇఆర్‌టి) న్యూఢిల్లీ వారిచే ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం ఉద్దేశం 6 సంవత్సరాలు నిండి 1వ తరగతిలో చేరిన విద్యార్థులు సంబంధించిందన్నారు. ఈ కార్యక్రమం ప్రాథమిక దశలో వుందని మరలా మూడు నెలల తర్వాత ఇదే పాఠశాలలో విద్యార్థులకు ముగింపు కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమం ప్రాంతీయ విద్యాకేంద్రం మైసూర్, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలో సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. మండల విద్యాశాఖాధికారిణి ఎస్.సునీత మాట్లాడుతూ 1వ తరగతి చదివే పిల్లల్లో వుండే నైపుణ్యాలను, కృత్యాలను, రకరకాల ఆటపాటల ద్వారా వెలికితీయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు.ఈ కార్యక్రమం ఇస్కపల్లి, అల్లూరుపేట, నార్తుమోపూరు పాఠశాలలో ఈ నెల 19 నుండి 22 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చెంచుసుబ్బయ్య, ఫీల్డ్ ఇన్విస్టిగేటర్లు పి.నాగరాజురావు, సి.హెచ్.గోపాల్, ఓ.వెంకటేశ్వరరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మూడవరోజు కూడా విస్తృతంగా గాలింపు చర్యలు



**మర్రిపాడు, జూన్19, ప్రభాతవార్త :** రెండు రోజుల క్రితం నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై నెల్లూరు సరిహద్దుప్రాంతమైన కదిరినాయుడు పల్లి గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో కారుపై పులి దాడి చేసినట్టు చెబుతున్న ఘటనలో కారుపై దాడికి పాల్పడిన జంతువుకోసం రెండు రోజులుగ ఆఫారెస్ట్ అధికారులు రాత్రింబవళ్ళు అడవిని జల్లెడ పడుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా బుధవారం మూడవ రోజు కూడా దాదాపు 3కిలోమీటర్ల లోపల అడవిప్రాంతంలో అణువణువు గాలిస్తున్నారు. కుంటనీళ్ళపాడు గ్రామానికి సమీపంలో పొదలకుంట అనే అటవీప్రాంతంలో నీటి గుంటల సమీపంలో ఫారెస్ట్ సిబ ్బంది పులిజాడకోసం త్రీవంగా గాలిస్తున్నారు. కారును వెంబడించిన జంతువు పులి అవునా కాదా అనే విషయం స్పష్టత లేకపోయినా ప్రజల్లో ఉన్న భయాందోళనలు తొలగించేందుకు ఫారెస్ట్ అధికారులు తీవ్రంగా అడవిలో గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు 20మంది అటవీ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటికే కారుపై దాడిచేసింది పులికాదు అని జిల్లా ఫారెస్ట్ అధికారి వెల్లడించడం విశేషం.

## హైస్కూల్ సమస్యలపై టీఎన్ఎస్ఎఫ్ సమీక్ష



**మనుబోలు, జూన్ 19, ప్రభాతవార్త :** సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మనుబోలు టీడీపీ యువనేత, తిరుపతి పార్లమెంటు కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి ఆదేశాల మేరకు టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి విభాగం నాయకులు బుధవారం ఈవీఎన్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో పర్యటించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తాగునీటి సౌకర్యం, బాత్‌రూమ్‌లు గురించి చర్చించారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి విభాగం నాయకులు మాట్లాడుతూ వీలైనంత త్వరలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి టీఎన్ఎస్ఎఫ్ ఎప్పుడు కృషి చేస్తుందని సర్వేపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రేవూరి సుమంత్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి విభాగం నాయకులు అవినాష్, నంద, ప్రవీణ్, వెంకటేష్, బెనర్జి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీపార్టీలోకి వచ్చేందుకు కొందరు నేతల యత్నాలు

**మనుబోలు, జూన్ 19, ప్రభాతవార్త :** సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అఖండ విజయం సాధించడంతో తెలుగుదేశం పార్టీకి ఎక్కడ లేని క్రేజ్ ప్రారంభమైంది. నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఎక్కడా లేని ఆనందం వెల్లివిరుస్తుంది. అయితే ఈ ప్రయత్నంలో వైకాపా పార్టీకి చెందిన కొందరు నాయకులు తమ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఓడిపోవడంతో ఇప్పటికి జీర్ణించుకోలేకున్నారు. మళ్లీ వైకాపా గెలుస్తుందని, కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోసం ప్రయత్నించిన కొందరు నాయకులు ఇప్పుడు తెలుగుదేశం పార్టీలోకి చొరబడేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. వీళ్లంతా గోడమీద పిల్లిలాగా వైకాపా గెలుస్తుందని భావించి ఆ పార్టీ ఓడిపోవడంతో మళ్లీ ఐదేళ్లు ఎలా జనాల్లో తిరగాలి, ఎలాగైనా స్వప్రయోజనం పొందాలనే ధోరణిలో పావులు కదుపుతున్నట్లు చెప్తున్నారు. ఈ క్రమంలో వైకాపాకు చెందిన కొందరు వ్యక్తులు టీడీపీ నాయకులతో మంతనాలు చేస్తున్నట్లు సమాచారం. తమ నాయకుడిని ఓడించేందుకు ప్రయత్నించి ఓట్లంతా వైకాపాకు వేసి ఇప్పుడు తమ పార్టీలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తే చేర్చుకునే సమస్యే లేదని టీడీపీకి చెందిన నాయకులు ఖరాఖండిగా చెప్తున్నట్లు సమాచారం. ఆ పార్టీ నాయకులను చేర్చుకోకపోగా ఈ ఐదు సంవత్సరాల్లో వాళ్లు చేసిన అక్రమాలు, అన్యాయాలు కూపిలాగి వడ్డీతో సహ చెల్లిస్తామని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇప్పటికే దూకుడు పెంచిన దేశం నాయకులు అదే పనిలో ఉన్నట్లు బోగట.

## హౌసింగ్ కార్యాలయానికి ఫ్యాన్, ట్యూబ్‌లైట్ వితరణ



**బిట్రగుంట, జూన్ 19 ప్రభాతవార్త :** బోగోలు మండలం హౌసింగ్ కార్యాలయంలో గత కొన్ని నెలలుగా ఫ్యాన్, ట్యూబ్‌లైట్ పాడైపోయి ఇబ్బంది పడుతుండటంతో రాగాల పావని ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా బోగిరి ప్రభాకర్ బుధవారం వితరణగా అందజేశారు. గండే మధు, ముళ్ళ తదితరులు పాల్గొన్నారు.

## కావలిలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు




**కావలి రూరల్, జూన్ 19 ప్రభాతవార్త :** ఎఐసిసి మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ 54వ జన్మదిన వేడుకలు కావలి పట్టణం రామమూర్తిపేటలోని కావలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బోగోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంచి వెంకటేశ్వర్లు, కార్యాలయ కార్యదర్శి వీరబ్రహ్మం, నాయకులు రవిబాబు, గురవయ్య, విద్యార్థి విభాగ నాయకులు నితీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెళ్ళి రోజు సందర్బంగా పేదలకు భోజన ప్యాకెట్లు వితరణ



**కావలి రూరల్, జూన్ 19 ప్రభాతవార్త :** కావలి పట్టణానికి చెందిన కానిస్టేబుల్ షేక్ బాబుల్, రమీజా పెళ్ళి రోజు సందర్భంగా సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో బుధవారం కావలి పట్టణంలోని బుడమగుంట గిరిజన కాలనీలోని నిరుపేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలు బాబుల్, రమీజాలు మాట్లాడారు. తమ పెళ్ళి రోజు సందర్భంగా పేదలకు ఒక్క పూట అయినా ఆకలి తీర్చడం సంతోషంగా వుందన్నారు. తమ పిల్లల పుట్టిన రోజును పురస్కరించుకొని గత నాలుగు సంవత్సరాలుగా సంయుక్త సేవా సంస్థ ద్వారా సేవలందిస్తున్నామన్నారు. తమకు ఈ అవకాశాన్ని కల్పించిన సంయుక్త సేవా సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజులలో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

## చెమిడిదపాడు ఆలయం వద్ద 108 హనుమాన్ చాలీసా పారాయణం



**కందుకూరు, జూన్ 19, ప్రభాతవార్త :** చెమిడిదపాడు గ్రామ బస్టాండ్ వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీపంచముఖ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద 23 వతేది ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 108 హనుమాన్ చాలీసా పారాయణం చేయనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు ఆలూరి వెంకట హనుమంతరావు తెలిపారు. 2022 తొలిఏకాదశి పర్వదినం నుంచి ప్రతి ఆదివారం ఏకాదశ హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 23 తో 108 ఆదివారాలు పూర్తి అవుతున్న నేపద్యంలో ఆలయ నిర్మాణ ప్రాంగణంలో 108 హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్నామని ఈ కార్యక్రమంలో భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే కోటి హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం జరుగుతోందని ఇప్పటి వరకు 50 లక్షల హనుమాన్ చాలీసా పారాయణం భక్తులు అందరూ చేసి ఆలయ ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన కోటి హనుమాన్ చాలీసా పారాయణ స్థూపం కోసం సమర్పిస్తున్నారని తెలిపారు. కోటి హనుమాన్ చాలీసా పారాయణం పూర్తి కాగానే స్థూపం నిర్మాణం చేపట్టనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు తెలిపారు. దీనితో పాటు 108 కోట్ల శ్రీరామ నామ జపం కూడా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతోందని ఇప్పటి వరకు 23 కోట్ల శ్రీరామ నామ జపం భక్తులు ట్రస్ట్‌కు సమర్పించినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణం కోసం దాతలు ముందుకు వచ్చి సహకరిస్తున్నారని వారికి ట్రస్ట్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ



**నెల్లూరు, జూన్ 19, ప్రభాతవార్త – వైద్యం :** నెల్లూరు నగరం ట్రంకు రోడ్డు శివాజీ సెంటర్ నందు బుధవారం హింధూ సామ్రాజ్య దినోత్సవ సందర్భంగా చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మోర్చాల సమన్వయకర్త పి. సురేందర్ రెడ్డి రాష్ట్రీయ స్వయంసేవక సంఘం ప్రాంత కుటుంబ సంయోజక్ పుట్ట శేషు రెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి. సురేందర్ రెడ్డి మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహారాజ్ సింహాసనాన్ని అధిష్టించి 350 సంవత్సరాలు నేటితో పూర్తవుతున్నాయని పేర్కొంటూ గత 35 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో శివాజీ సెంటర్ పేరుతో వినాయక చవితి ఉత్సవాలను పలు జాతీయ సాంస్కృతిక కార్యక్రమాలను ఏబివీపీ పూర్వ విద్యార్థులు ఇక్కడ నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంత నుంచి భారత మాజీ ఉపరాష్ట్ర పతి శ్రీ వెంకయ్య నాయుడు పలు సిద్ధాంతిక కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలో శివాజీ మహారాజ్‌ను స్మరించుకోవడానికి ఏబీవీపీ పూర్వ కార్యకర్తల కోరిక మేరకు ఆయన విగ్రహాన్ని ఇక్కడ శ్రీ ముప్పవరపు హర్షవర్ధన్, పెండెం మల్లికార్జునల సౌజన్యంతో ఏర్పాటు చేశామన్నారు. శివాజీ మహారాజ్ భారత మాతకు చేసిన సేవలను నిత్యం స్మరించుకోవాల్సిన అవసరం ఉంది ఉన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ పుట్ట శేషు మాట్లాడుతూ ప్రాంతాలకు మతాలకు అతీతంగా భారతీయులను తేజవంతులుగా తీర్చిదిద్ది సుస్వరాజ్యపాలన చేశారన్నారు. తల్లి బాయ్ క్రమశిక్షణ మహిళల పట్ల గౌరవ మర్యాదలు అలవర్చుకుని పూర్తి స్థాయిలో అందరి పట్ల ఆచరించాలన్నారు. ప్రపంచ స్థాయిలో ఆయన వీరోచిత కార్యక్రమాల్ని అన్ని దేశాలు కొనియాడాయని అన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ ఏబీవీపీ కార్యకర్తలుగా శివాజీ విగ్రహ ప్రతిష్టను జిల్లా అధ్యక్షుడిగా తన పదవీకాలంలో ప్రతిష్ట చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మరాఠా సంఘం ప్రతినిధులు, ఆర్ఎస్ఎస్ నగర సంగ చాలక్ భయ్యా రవి, విశ్వహిందూ పరిషత్ ప్రాంత కార్యదర్శి ఏవిఆర్ మోహన్ రావు, ఏబీవీపీ నగర సంయోజక్ గంగాధర్ శివాజీ ఉత్సవ సమితి అధ్యక్షులు బత్తిన సాయి కుమార్ రెడ్డి, హింధూ చైతన్య వేదిక అధ్యక్షులు పీజీ మహేశ్, శివాజీ సెంటర్ మిత్ర మండలి సభ్యులు కెవి సుబ్రమణ్యం, పేటేటి భాస్కర రావు, బిఎస్ రంగరాజన్, అలిమేలి శ్రీహరి, మూర్తి, మధుసూధన్, బాలసుబ్రమణ్యం, హర్షవర్ధన్, బిజెపి జిల్లా సెక్రెటరీ చిలక ప్రవీణ్ కుమార్ నగరంలోని చత్రపతి శివాజీ అభిమానులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



**వరికుంటపాడు, జూన్ 19, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రతి విద్యార్థి చదువుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జెడ్పిటిసి సభ్యులు రావెళ్ల నాగేంద్ర, టీడీపీ మండల పార్టీ కన్వీనర్ చంద్రా మధుసూధన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని పెద్దిరెడ్డిపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు చలపతి ఆధ్వర్యంలో ప్రభుత్వం అందించిన కిట్లను జెడ్పిటిసి రావెళ్ల నాగేంద్ర, మండలపార్టీ కన్వీనర్ చంద్రా మధుసూధన్‌రావు లు విద్యార్థిని, విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి రావెళ్ల మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం గత ప్రభుత్వాలుకు భిన్నంగా విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పార్టీ కన్వీనర్ చంద్రా మధుసూధన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన యూనిఫామ్ దుస్తులు, నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలను వినియోగించుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమములో సర్పంచ్ అరవ మహేష్ నాయకులు నాదెండ్ల రాజేంద్ర, అడుసుమల్లి వెంకటేశ్వర్లు, మండల రైతు సంఘం అధ్యక్షులు వేమూరి మధు, స్కూల్ కమిటీ చైర్మన్ నాదెండ్ల రమేష్, ఉపాధ్యాయులు రావెళ్ల నాగార్జున, శ్రీహరి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## స్నేహశీలి రెవ.ఓబులాపురం దేవసహాయం



**వరికుంటపాడు, జూన్ 19, ప్రభాతవార్త :** స్వర్గీయ రెవ.ఓబులాపురం దేవసహాయం స్నేహశీలి, మృదుస్వభావి, వివాదరహితుడని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ చంద్రా మధుసూధన్ రావు అన్నారు. బుధవారం మండలంలోని కాకొల్లువారిపల్లి గ్రామములో తెలుగుదేశంపార్టీ నెల్లూరు పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు బిషప్ రెవ.డా.ఓబులాపురం దేవప్రసన్న తండ్రి రెవ.ఓబులాపురం దేవసహాయం ప్రథమ వర్ధంతి కూడిక కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఉదయగిరి, దుత్తలూరు, సీతారామాపురం, వింజమూరు, కలిగిరి, వరికుంటపాడు లాల పరిధిలోని పాస్టర్లు, టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు. ప్రముఖ సింగర్ టోని ప్రకాశ్ క్రిస్టియన్ పాటలు పాడారు. ఈ కార్యక్రమములో టీడీపీ నేతలు చంద్రా వెంకయ్య, పోకా మహేష్, వరికుంటపాడు గ్రామ సర్పంచ్ కొండెపోగు దిలీప్‌కుమార్, న్యాయవాదులు గొల్లపల్లి ఆంతోని బాబు, కాకి శ్రీనివాసులు, నేతలు కాకి ప్రసాద్, లోకసాని రవికుమార్, జమ్మలమడుగు ఇశ్రాయేలు, నేలటూరి జాషువా, స్వర్ణా కొండయ్య, సుధీర్‌బాబు, తాతపూడి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో నూతన విధానంలో పసుపు పంట



**కావలి రూరల్, జూన్ 19 ప్రభాతవార్త :** కావలి మండలం కొత్తపల్లి గ్రామంలో బెస్ట్ ఫార్మర్ మాధవరావు ఒక ఎకరం పొలంలో మూడు రకాల పసుపు డాంగ్, సుగంధి, కస్తూరిలను ప్రకృతి వ్యవసాయంతో నూతన విధానంలో వేశారు. ఈ సందర్భంగా బుధవారం డిపియం మాలకొండయ్య, అడిషినల్ డిపియం మునిరత్నం, ఆర్‌టిసి రవిచంద్ర ప్రసాద్‌లు పరిశీలించారు. అంతర్ పంటలుగా 30 రకాల పియండిఎస్ విత్తనాలు చల్లడం జరిగింది. పసుపు పండించడం వల్ల ప్రయోజనాలను, పియండిఎస్ వల్ల ఉపయోగాలు రైతులకు డిపియం మాలకొండయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో కావలి డివిజన్ మెంటర్స్ యంటిఎస్, ఎల్1, ఎల్2లు, ఎఫ్ఎస్‌లు, రైతులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు ప్రధానం



**మనుబోలు, జూన్ 19, ప్రభాతవార్త :** స్థానిక ప్రభుత జూనియర్ కాలేజీలో బుధవారం ఉదయం మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూనియర్ కాలేజీలో మొన్న జరిగిన పబ్లిక్ పరీక్షల్లో మొదటి, రెండు, మూడు స్థానాలు ప్రతిభ సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు నారపరెడ్డి సీతారామిరెడ్డి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానం చేశారు. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లా జనవిజ్ఞాన వేదిక మనుబోలు మండల శాఖ సౌజన్యంతో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బాలకోటేశ్వరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన గుండెపోటు నివారణ కారణాల గురించి, సీపీఆర్ గురించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా కోవూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు నారపరెడ్డి కిరణ్‌కుమార్ మాట్లాడారు. మనుబోలు మండల జేవీవీ నాయకులు నూనె లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మెజీషియన్ చైతన్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి, కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కొండబిట్రగుంటలో నేను బడికి పోతా




**బిట్రగుంట, జూన్ 19 ప్రభాతవార్త :** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నేను బడికి పోతా అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఇవోలు పి.ఎల్.నరసింహారావు, జయమ్మలు హాజరై గ్రామస్తులకు బడి పట్ల అవగాహన కల్పిస్తూ విద్యార్థుల చేత నినాదాలు చేయిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హ్యాబిటేషన్ పరిధిలో 11 మంది విద్యార్థులను బడిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మందుల వాడకంలో నిర్లక్ష్యం తగదు



**కోవూరు, జూన్19ప్రభాతవార్త :** దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వృద్ధులు మందుల వాడకంలో నిర్లక్ష్యం చూపకుండా క్రమం తప్పకుండా మందులు వాడుకోవాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నిరంజన్ తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని సచివాలయం-1లో బుధవారం ఎఫ్ఈసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా వృద్ధులు ప్రస్తుత సీజన్‌లో మితాహారం తీసుకుంటూ వ్యాయామం వంటి వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది , ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## చేజర్ల పరామర్శలు



**కోవూరు, జూన్19ప్రభాతవార్త :** కోవూరు పంచాయతీ పరిధిలోని రామిరెడ్డితోట ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు ఎం. వెంకటేశ్వర్లు అమ్మమ్మ సుబ్బమ్మ ఇటీవల మృతిచెందింది. ఈ మేరకు కుటుంబ సభ్యులను బుధవారం జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రామారావు, విజయ్, నరసింహ, మురళీకృష్ణారెడ్డి, అశోక్‌లు ఉన్నారు.

## మీ సేవా సహాయకునికి రెవెన్యూ సంతాపం



**కోవూరు, జూన్19ప్రభాతవార్త :** మీ సేవలో పని చేస్తూ తమవంతుగా అర్జీదారులకు వినూత్నమైన సేవలు చేస్తున్న పిచ్చిక శ్రీనివాసులు గుండెపోటుతో మృతిచెందారు. ఈ మేరకు ఆయన మృతదేహానికి కోవూరు డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్ పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు కుటుంబ సభ్యులను ఓదార్చి తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు నాగేశ్వరరావు, శ్రీనివాసులురెడ్డి, వీఆర్ఏలు అశోక్, సునీల్, తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే కావ్యను కలిసిన మండల పరిషత్ సిబ్బంది



**బిట్రగుంట, జూన్ 19 ప్రభాతవార్త :** బోగోలు మండల పరిషత్ కార్యాలయ పాలనాధికారి ఆర్.గోవిందరావు ఆధ్వర్యంలో బుధవారం కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డిని ఆయన నివాసంలో కలిసి అభినందించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలలో కావలి ఎమ్మెల్యేగా కావ్య కృష్ణారెడ్డి అత్యధిక మెజార్టీతో ఎన్నికైనందుకు వీరంతా కలిసి ఆయనను సత్కరించారు.

## అతిసార వ్యాధిపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



**కోవూరు, జూన్19ప్రభాతవార్త :** ప్రస్తుతం ఈ సీజన్‌లో వచ్చే అతిసార వ్యాధి వంటి సీజనల్ వ్యాధులపై తల్లులు ప్రత్యేక అవగాహన చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. కోవూరు పంచాయతీ పరిధిలోని సత్రంవీధి ప్రాంతంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సీజనల్ వ్యాధులపై కేంద్రం పరిధిలో ఉన్న తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కలుషిత నీరు తాపకుండా నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలన్నారు. అదేవిధంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ముఖ్యంగా గర్భవతులు, బాలింతలు ఈ సీజన్‌లో వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హిమబిందు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి శుభాకాంక్షలు



**కందుకూరు,జూన్ 19,ప్రభాతవార్త :** కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలి పారు .ఇప్పటికే ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి,రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రశాంతిరెడ్డిని సన్మానించిన ఆర్యవైశ్య మహిళలు



**కోవూరు, జూన్19ప్రభాతవార్త :** కోవూరు ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గురువారం కోవూరుకు చెందిన ఆర్యవైశ్య మహిళలు శాలువా, పుష్పగుచ్ఛంతో ప్రత్యేకంగా అభినందించారు. కోవూరు నియోజకవర్గం నుంచి తొలిసారిగా మహిళా ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన ప్రశాంతిరెడ్డిని ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేకంగా సత్కరించి రానున్న రోజుల్లో మంత్రిగా చూడాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## ఓవెల్ ఐఏఎస్ అకాడమిలో నూతన బ్యాచ్ ప్రారంభం



**నెల్లూరు,జూన్19 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక మద్రాసుబస్టాండ్ సమీపంలోని ఓవెల్ ఐఏఎస్ ఆడాకమిలో బుధవారం నూతన బ్యాచ్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా నెల్లూరు రూరల్ డిఎస్పీ ఆంజనేయరెడ్డి పాల్గొన్నిమాట్లాడారు. ఓవెల్ విద్యాసంస్థలకు చెందిన ఓవెల్ ఐఏఎస్ అకాడమిలో అత్యల్ప ఫీజులకు ఉత్తమ శిక్షణ ఇవ్వటం సంతోషంగా ఉందన్నారు. విద్యార్దులకు ఉన్నత ఆఫీసర్లుగా తీర్ధి దిద్దేందుకు ఓవెల్ యాజమాన్యం చేస్తున్న కృసి అభినందనీయమని కొనియాడారు. ఓవెల్ విద్యాసంస్ధల చైర్మన్ ఆర్.వేణు మాట్లాడుతు క్రమశిక్షణ,ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించటం తమ ప్రత్యేకత అని తెలిపారు. పోటీ పరీక్షల్లో విద్యార్దులు అవలంబించాల్సిన పద్దతులు, తదితర వాటిపై కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని అనుభవవం కలిగిన అధ్యాపకులచే ఈ ఐఏఎస్ అకాడమిని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.నేడు నూతన బ్యాచ్ ప్రారంభం కావటం సంతోషంగా ఉందని, భవిష్యత్ లో వీరు ఘన విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం డిఎస్పీని శాలువా కప్పి జ్ఞాపికను అందించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఓవెల్ విద్యాసంస్ధల జిఎం మహదేవ్, ఈడి బాలు ప్రిన్సిపాల్ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయ శాఖ మంత్రిని సన్మానించిన పోలంరెడ్డి



**కోవూరు, జూన్19ప్రభాతవార్త :** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని బుధవారం కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయనను శాలువా, బొకేతో పాటు వెంకటేశ్వర్లు స్వామి ప్రతిమను అందించి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు కోవూరు నియోజకవర్గంకు సంబంధించిన పలు విషయాలను చర్చించారు.

## వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని అభినందించిన కోవూరు మండల డీలర్లు



**కోవూరు, జూన్19ప్రభాతవార్త :** కోవూరు ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఆమె స్వగృహంలో కోవూరు మండలానికి సంబంధించిన చౌక డిపో డీలర్లు కలిసి శాలువాతో సత్కరించి బొకేతో సన్మానించారు. ఈ సందర్భంగా చౌక డిపో డీలర్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి ఈ సందర్భంగా డీలర్లు పడుతున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా వాహనాల సమస్య కూఆ ఎక్కువగా ఉందని, తిరిగి పాత పద్దతిలోనే డీలర్లే సరుకులు అందించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ఆమెను కోరారు.మండలంలోని డీలర్లతో పాటు లేగుంటపాడు సర్పంచ్ రాజాగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెట్టి మదన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## మంత్రి ఆనంని కలిసిన మెడికవర్ ప్రతినిధులు



**నెల్లూరు, జూన్ 19, ప్రభాతవార్త – వైద్యం** రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించడమే కాకుండా దేవాదాయశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారంచేసిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని వారు ఆనంను నగరంలోని సంతపేటలో ఉన్న వారి నివాసంలో కలిశారు. మెడికవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్ రెడ్డి, మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బింధురెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సతీష్ బాబు, పిఆర్‌వో చందువర్మ, ఆత్మకూరు మున్సిపాలిటీ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి తదితరులు రామ నారాయణరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాతో సత్కరించి బుద్ధ ప్రతిమను అందజేశారు.

## రావూస్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు




**నెల్లూరు,జూన్19 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక రావూస్ ఎంబిఏ కళాశాలలో నేడు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా రావూస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.శివకోటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. తమ విద్యాసంస్థల్లోని ఎంబిఏ స్టడీస్ జిల్లాలో మరే ఇతర కాశాలలకు సాధ్యం కాని ఫలితాలను సాధిస్తూ ప్రధమ స్థానాలు కైవశం చేసుకో వటం జరుగుతుందన్నారు. కోర్సు పూరైన విద్యార్ధులకు ఉపాది అవకాశాలు కల్పించ టంలో కూడా తాము ముందు వరుసలోనే ఉన్నామన్నారు. ఇప్పటికే అనేక ఎన్‌ఎంసీ కంపెనీలతో ఒప్పదం చేసుకుని వందలాది మంది విద్యార్ధులకు ఉద్యోగ అవకాశాలు కల్పించటం జరిగిందన్నారు. అనంతరం విద్యార్ధులకు సరి ్టఫికేట్స్‌ను పంపిణీ చేశా రు. సిఈఓ శివారెడ్డి పాల్గొన్నారు.




## అధికారులతో, ప్రజలతో కిక్కిరిసిన ఎమ్మెల్యే కావ్య నివాసం





**కావలి, జూన్ 19 ప్రభాతవార్త** కావలి ముసునూరులోని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నివాసం అధికారులతో, ప్రజలతో బుధవారం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి రాత్రి దాకా జనసంద్రాన్ని తలపిస్తున్నట్లు ఆ ప్రాంతం హోరెత్తుతుంది. కావలి ఎమ్మెల్యేగా కావ్య కృష్ణారెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడంతో అభినందనలు తెలిపేందుకు అధికారులు, ప్రజలు క్యూకట్టారు. పెద్దఎత్తున తరలివస్తున్న వారిని పేరుపేరున పలకరించి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలుపుతున్నారు. బొకెలు, శాలువలు,పూలమాలలు వద్దని ప్రేమతో రావాలని ఎమ్మెల్యే కావ్య తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు ప్రజల సమస్యల్ని పరిష్కరించి ప్రజల మన్ననల్ని పొందాలని ఆయన చెప్పారు. బుధవారం పట్టణంలోని వస్త్ర వ్యాపారస్తులు, అధికారులు, వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్యే కావ్యకృష్ణారెడ్డి కి అభినందనలు



**వింజమూరు,జూన్19,ప్రభాతవార్త :** కావలి ఎన్‌డిఎ కూటమి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని వింజమూరు సొసెటీ మాజీ అధ్యక్షుడు జూపల్లిరాజారావ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలు , పూలమాలలతో సత్కరించారు. ఈసందర్భంగా జూపల్లి మాట్లాడుతూ కావలి చరిత్రలో తెలుగుదేశం జెండాను రెపరెపలాడించిన ప్రజా సేవకుడు కావ్యకృష్ణారెడ్డి అన్నారు. గతంలో ఉదయగిరి నియోజకవర్గంలో కావ్య చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ఎంతోమంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు , బ్యాగులు పంపిణీ చేయడంతోపాటు పేదలకు పెళ్ళి కానుక , అనారోగ్య బాధితులకు ఆర్ధికసాయమందించి ప్రజల హృదయాల్లో నిలిచారన్నారు. అలాంటి సేవకుడు కావ్య గెలుపు కావలి అభివృద్ధికి మలుపు అవుతుందన్నారు. మండల బిసి నాయకుడు భోజనపు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి గుడికి 600 శ్రీరామ నామ ఇటుకలు



**కందుకూరు,జూన్ 19,ప్రభాతవార్త :** కందుకూ రు వాసవి సిస్టర్స్ ఆధ్వర్యంలో చెమిడిదపాడు వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీరామ భక్త భవిష్యత్ బ్రహ్మశ్రీపంచముఖ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయానికి శ్రీరామ నామం ఇటుకలను సమర్పించారు.స్థానిక పామూరు రోడ్డులో ఉన్న శ్రీరామాలయం వద్దశ్రీరామ నామం జపిస్తూ అక్కడకు తెప్పించిన 600 ఇటుకలను పసుపు నీటితో శుద్ధి చేసి శ్రీరామ నామం జపిస్తూ ఒక్కొక్క ఇటుక పై శ్రీరామ అనివ్రాశా రు.అనంతరం శ్రీరామ అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు.గొల్ల పద్మావతి తో పాటు స్థానిక వాసవి సిస్టర్స్ ఆద్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఇప్పటికే గుడ్లూరు వాసవి సిస్టర్స్ ఆధ్వర్యంలో 2 వేల ఇటుకలను గుడి కి సమర్పించారు.శ్రీరామ నామ స్మరణ చేస్తూ ఇటుకలపై శ్రీరామఅని వ్రాసిన ఇటుకలనే ఆలయ నిర్మాణానికి వినియోగించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు ఆలూరి వెంకట హనుమంతరావు తెలిపారు.ఆలయ నిర్మాణంతో పాటుశ్రీరామ నామ ధ్యాన మందిరం నిర్మాణం కూడా ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్నట్లు అది కూడా పూర్తి శ్రీరామనామ స్మరణ చేస్తూ సమర్పించిన ఇటుకలతోనే నిర్మించడానికి కార్యక్రమం రూపొందించినట్లు తెలిపారు.కందుకూరు వాసవి సిస్టర్స్ 600 శ్రీరామ నామ ఇటుకలను మంగళవారం రాత్రిచెమిడిదపాడు ఆలయం వద్దకు పంపారు.ఈ కార్యక్రమంలో వాసవి సిస్టర్స్‌తో పాటు గురుస్వామి హనుమత్ ప్రసాదు ట్రస్ట్ అధ్యక్షుడు ఎ,వి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై జాగ్రత్తలు వహించాలి



కావలి, జూన్ 19 ప్రభాతవార్త ప్రజలు డిపాజిట్ ఖాతాలు, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై జాగ్రత్తలు తీసుకోవాలని నెల్లూరు జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రదీప్ తెలిపారు. కావలి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. డిజిటల్ పేమెంట్లు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు బ్యాంక్ అకౌంట్ కలిగి వుండాలన్నారు. రూపాయి ఎటియం కార్డు తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబంలో బీమా పథకాలు కలిగి వుండాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు, అశోక్‌కుమార్, కావలి కెనరా బ్యాంక్ మేనేజర్ నరేష్, బాబారావు, సతీష్, పాలిటెక్నిక్ పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జనశక్తి ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ స్థాపన



**నెల్లూరు, జూన్ 19, ప్రభాతవార్త – వైద్యం** విద్యుత్ శాఖలో అన్ని పార్టీలకు సంబంధించిన అనుబంధ సంఘాలు ఉన్నాయని, అయితే రాష్ట్రంలో జనసేన పార్టీకి విద్యుత్ శాఖలో అనుబంధ సంఘం లేదని దీని దృష్టిలో ఉంచుకొని గురువారం తిరుపతిలో జనశక్తి విద్యుత్ ఎంప్లాయిస్ కాంట్రాక్ట్ కార్మికుల ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ సంఘాన్ని నూతనంగా స్థాపిస్తున్నట్లు వెండి వెంకటేశ్వర్లు తెలి పారు. బుధవారం నగరంలోని విద్యుత్ భవన్‌లో వెంకటేశ్వర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా స్థాపించే ఈ యూనియన్ ఈ నెల 23వ తేదిన ఆదివారం ఉదయం పది గంటలకు తిరుపతిలోని గాయత్రి రెసిడెన్సీ ఆర్కే కళ్యాణమండపం రెండో వీధి తిరుచానూరు తిరుపతి పట్టణంలో జనశక్తి ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి విద్యుత్ శాఖలో పనిచేసే ఎవరైనా కాంట్రాక్టు కార్మికులు ఉద్యోగులు రాష్ట్ర నలుమూలల నుండి విరివిగా హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు.

## నారాయణలో గర్భణీలకు డ్రైఫ్రూట్స్ పంపిణీ




**నెల్లూరు, జూన్ 19, ప్రభాతవార్త – వైద్యం** నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం మరొక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. గత ఎనిమిది సంవత్సరాలుగా నారాయణ మాతృసేవా పథకంలో గర్భవతులకు ఉచితంగా పరీక్షలు, మందులు, పౌష్టికాహారం, కాన్పు కొరకు ఉచిత అంబులెన్సు ఉచిత కాన్పులు, బేబి హెల్త్ కిట్ అలాగే బిడ్డ పోషణ నిమిత్తం నగదు ప్రోత్సాహకం అందించడం జరుగుతుందని ఆసుపత్రి వైద్యులు తెలియజేశారు. ఇప్పటి వరకూ సుమారు 30 వేల మందికి పైగా మాతృమూర్తుల మన్ననలు అందుకున్న నారాయణ మాతృసేవా పథకంలో గర్భిణీ స్త్రీలకు 5వ నెల నుంచి 9వ నెల వరకు నెలవారీ చెకప్‌కి గర్భిణీకి వచ్చిన ప్రతిసారి ఈ డ్రైఫ్రూట్స్ (బాదం, పిస్తా, చిక్కీలు – 2) అందించడం జరుగుతుందన్నారు. డైటీషియన్ సూచన మేరకు గర్భవతులకు పౌష్టికాహారంతో పాటు డ్రైఫ్రూట్స్ అందించడం జరుగుతుందని బుధవారం నగరంలోని చింతా రెడ్డిపాలెంలో ఉన్న ఆ హాస్పిటల్ లోని గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రసన్న చేతుల మీదుగా ఆసుపత్రిలో అనేక మంది గర్భిణీలకు డ్రైఫ్రూట్స్ పంపిణీ చేయడం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్, గైనకాలజీ వైద్యులు, నారాయణ హాస్పిటల్ ఏజీఎం ఎసి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు వాటర్‌ప్లాంట్ వితరణ



బుచ్చి జూన్ 19 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో విద్యార్దులకోసం మంచి నీటి ఆర్‌ఒ సిస్టమ్ ప్యూరిటి వాటర్ ప్లాంట్‌ని కొండా అశోక్‌రెడ్డి,తన్నీరు సుధాకర్. లైన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ పైడారవి, సహకారంతో వాటర్‌ప్లాంట్ ప్రారంభించారు. పాఠశాల పూర్వ విద్యార్దిని ముల్లంగి సుభాషిణి విద్యార్దులకు 15 వేల రూపాయాలు ఆర్ధిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్దిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్, ప్రిన్సిఫాల్ సురేఖ, గిరిజకుమార్ తదితరులు పాల్గోన్నారు.

## వైభవంగా కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



సంగం జూన్ 19 ప్రభాతవార్త సంగం మండలంలోని దువ్వూరు గ్రామంలో కోటేశ్వరస్వామి సన్నిధిలో బ్రహ్మోత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. బుధవారం ద్వజపతం ఎగురవేస్తు అర్చకులు శివకుమార్ ముక్కోటి దేవతలను ఆహ్వానించారు. అనంతరం భక్తులకు కొడిముద్దను అందజేశారు.ఈకార్యక్రమంలో గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

## ఈ నెల 21న హుండీల లెక్కింపు



**వలేటివారిపాలెం జూన్ 19, ప్రభాతవార్త** ఈ నెల 21వ తేదీన మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తుందని ఆలయ డిప్యూటీ కమీషనర్ కె.బి శ్రీనివా సులు తెలిపారు.భక్తులు తమ కానుకలు, పిడికిటి రూకలు తదితర మొక్కుబడులను 12 శనివారాలలో ఈ హుండీలలో వేయడం జరిగింది. ప్రస్తుతం ఇవి నిండ డంతో లెక్కింపు కార్యక్రమం అవసరమైంది. ధశుకృవారం ఉదయం 8గం॥లకు కొండపైన కళ్యాణమండపం ఆవణలో పులువురు అధికారులు సమక్షంలో లెక్కించనున్నట్లు ఆయన తెలిపారు.

## అబ్దుల్ అజీజ్‌ని కలిసిన ఒకటవ పట్టణ సిఐ



**నెల్లూరు, జూన్ 19, ప్రభాతవార్త – వైద్యం** తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్‌తో బుధ వారం నగరంలోని హరినాధపురంలో ఉన్న అజీజ్ నివాసంలో ఒకటవ పట్టణ సిఐ అశోక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి అజీజ్‌కి పూల బొక్కే అందజేశారు.